


**“పదకొండు గంటలకు పనేమీ పెట్టేసుకోకు మనమిద్దరం రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్తున్నాం నీ బండిమీద” అన్నాడు అపదరావు కేంటీన్‌లో టీ తాగుతూ.**

**“నేనెందుకూ? నీకూ నాకూ పెళ్ళాం లేదుగా రిజిష్టర్ చేసుకో దానికి” అన్నాడు అవకాశరావు నవ్వుతూ.**

“నువ్వూ రావాలి. పెళ్ళిలాంటిదే. మనిద్దరం పాతికేళ్ళ క్రితం కంపెనీలో అప్పు తీసుకుని ఇళ్ళు కట్టుకున్నాం గుర్తు లేదు? నా అప్పు తీరిపోయింది. రిజిస్ట్రార్ ఆఫీసులో తనకా కాగితాల్ని నా పేరు మిదికి మళ్ళి మార్చుకోవాలి. కొద్దిరోజుల్లో నీకూ నా అవసరం పడుతుంది అందుకు.”

“అద్సరే. పద్దతేంటో నువ్వు చెబితే సరిపోతుంది గదా, నేనెందుకు?” అంటూ మొదటికే వచ్చాడు అవకాశరావు.

“సాక్షి సంతకం కోసం. నీకవసరమైనప్పుడు నన్ను రమ్మంటే నేను రావాలి కదా! పైగా నాకిప్పుడు చేతిలో బండిలేదు. అందుకూను” అన్నాడు.

అవకాశరావు అవకాశాన్ని బట్టి జారిపోనూ గలడు. పట్టుకుని వేలాడాగలడు. అందుకే ముందాలోచనతో ‘సరే’ అన్నాడు.

❋ ❋ ❋

ఉదయం పదకొండు గంటలకు పది దొమ్మి కెసుల్ని ఒకేసారి బుక్ చేస్తున్న పోలీస్ స్టేషన్‌లా వుందా ఆఫీసు. వరండాలో ఉన్న ఒక్క బెంచీ మీదా ఆరుగురు ఆడవాళ్ళు కూర్చుని వున్నారు. వరండాలూ, లోపలి గదులూ జనంతో కిటకిటలాడుతున్నాయి.

ముందు గదిలోకి అడుగు పెట్టగానే కుడిచేతి వైపు బల్లదగ్గర ఒకాయన కూర్చుని వున్నాడు. మనిషి కనబడకుండా ఆయన చుట్టూ జనం మూగి వున్నారు. ఆయన వెనక నున్న గోడకి గణపతిరావు అని పేరున్న బోర్డు వేలాడుతోంది. ఆ ఆఫీసులో ఏ పని జరగాలన్నా మొదట దర్శించాల్సింది ఆ గణపతినే అని తెలుసుకున్న అపదరావు జనాన్ని ఛేదించుకుంటూ అమాయక అభిమన్యుడిలా లోపలికి దూరాడు. అవకాశరావు మాత్రం

బయట గోడకున్న పెద్ద బోర్డును చూస్తూ అక్కడే వుండిపోయాడు. కంప్యూటర్లు ప్రవేశ పెట్టాక ఏ పని ఎంత వ్యవధిలో జరుగుతుందో, జరగాలో సూచించే బోర్డు అది. ప్రజల సౌక ర్యార్థం పెద్దపెద్ద అక్షరాలతో ఒక బోర్డు అక్కడ పెట్టారు. ఎవరికైనా ఏ అసౌకర్యమైనా కలిగితే గౌరవనీయులైన పెద్దాఫీసర్ వారికి ఫిర్యాదు చేసుకోవచ్చునని సూచన కూడా కింద రాసి వుంది.

అవకాశరావుకి ఆశ్చర్యమనిపించింది. మనం కూడా అభివృద్ధి పథంలోకి అడుగువేస్తు న్నామోచ్" అని గర్వంగా చొక్కాకున్న కాలర్‌ని ఎగదీయబోయాడు. ఇంతలో ఆపదరావు బయ టకు రానే వచ్చాడు. అతని చేతిలో ఏవో ప్రిం టెడ్ ఫారాలున్నాయి. కంప్యూటర్‌కి డేటా అం దించే ఫారాలట అవి. ఫారాన్ని గోడమీద ఒత్తు కోసం పెట్టి నింపడం మొదలుపెట్టాడు ఆపద రావు. పేరు, వూరు లాంటివేవో వివరాలు నింపి సంతకం చేసి మళ్ళీ గణపతి దగ్గరకే పరుగు పెట్టాడు. అక్కడ టేబిల్ మీదున్న ఫారాల దొంతర కింద తన ఫారమూ వుంచి కాస్త దూరంలో చేతులు కట్టుకుని నిల్చున్నాడు. ఆ ఫారాల కట్టల మధ్యనించి చూస్తే గణపతి రావు వ్యాసభారతాన్ని రాస్తున్న వినాయకుడిలా అనిపించాడతని కళ్ళకి.

పది నిముషాల్లో దొంతర తరిగింది. ఫారాల మీద నాలుగు టిక్కులూ నాలుగు అం కెలూ వేసి, "కంప్యూటర్ కౌంటర్లో ఇచ్చే యండి" అంటూ ఆపదరావుకిచ్చేశాడు గణపతి రావు.

ఈ గదికి కుడిపైపుగా రెండు గ్లాస్ కేబిన్ లున్నాయి. ఒక కేబిన్‌లో కంప్యూటర్‌కి డేటా ఫీడ్ చేస్తోందో అమ్మాయి. రెండోది కేష్ కౌంటరు. అందులో ఎవరూ లేరు. కౌంటర్ తలుపు మూసేసి వుంది.

ఫారాన్ని కంప్యూటర్ కౌంటర్లో ఇచ్చేసి నిల్చున్నాడు ఆపదరావు. రెండు నిముషాల్లో డేటా కంప్యూటర్లోకి ఎక్కించేసి కంప్యూటర్ ప్రింట్ చేసిన ఓ కాగితాన్ని ఆపదరావుకి అం దించిందా అమ్మాయి. పేరూ, వివరాలూ, గవర్నమెంటుకి చెల్లించాల్సిన సొమ్ము వివరం అందులో ప్రింట్ చేయబడి వుంది. ఆ అంకె కోసం ఆత్రంగా చూశాడతను. అక్షరాలా ఏడొందల ఎనభై ఐదు రూపాయలు.

వెంటనే తను పనిచేస్తున్న కంపెనీ ఆఫీసర్‌గారికి ఫోన్ చేశాడు. ముందుగా చెప్పి వుండడం వల్ల పావుగంటలో జీవు వేసుకుని వచ్చి చిన్న ఆఫీసర్‌గారి ముందు కంపెనీ తరఫున సంతకం చేయాల్సిన కాగితాల మీద సంతకాలు చేసి వెళ్ళిపోయాడాయన.

మరో పావుగంటలో ఆపదరావు తాలూకు డాక్యుమెంట్లు పెద్దాఫీసర్‌గారి బల్లమీంచి స్టాంపులు వేసే బంట్రోతు బల్లమీదికి చేరాయి. ఆయన తను వెయ్యాల్సిన స్టాంపులు వేసేసి వివరాలు నింపి, "సాక్షులెవరైనా ఉన్నారా? ఉంటే ఇక్కడ సంతకం చెయ్యండి" అంటూ సంతకం ఎక్కడ చెయ్యాలో అక్కడ కుడి చేతి చూపుడువేలు పెట్టాడు. స్నేహధర్మాన్నీ, కర్త వ్యాన్నీ గుర్తు చేసుకుని ముందుకొచ్చాడు అవకాశరావు.

"వెయ్యి యివ్వండి" అన్నాడు బంట్రోతు కాగితాల మీంచి వేలు తియ్యకుండానే.

"వేలు తియ్యడానికి వెయ్యా?" ఆశ్చర్య పోయాడు అవకాశరావు. ఆపదరావుకి మాత్రం ఆ మాటల్లోని అర్థమేదో కొంత బోధపడి, తన కేదో ఆపద ముంచుకొచ్చినట్లునిపించి బాధ పడ్డాడు.

"ఫీజు కేష్ కౌంటర్లో కదా కట్టేదీ?" అడి గాడు ఆపదరావు సందేహిస్తూనే.

"కాదు ఇక్కడే" అన్నాడు బంట్రోతు చిరాగ్గా.

"పద్ధతులు తెలుసుకోరూ!" అన్నట్టుంది ఆయన ముఖం.

"మరి ఫీజు ఏడొందల ఎనభై అయిదేగా? అడిగాడు కాస్త గొంతు తగ్గించి.

"చిల్లర లెక్కగట్టి తెస్తే అలాగే యివ్వండి అదికాక రెండొందలు ఇక్కడ పంచాలి" చావు కబురు అతను చల్లగా చెప్పినా ఆపదరావుకి చెమట్లు పట్టాయి. పంచాల్సింది యివ్వకపోతే అతను చేతిలోని సంతకాలైన కాగితాలు వస్తాయో రావో అనిపించింది.

సొంతిళ్ళు కట్టుకుని, అప్పులు వడ్డీలతో సహా తీర్చేసుకుని ఈ మాత్రం యిచ్చుకోలేరా? అని అంటే? అందుకే వెంటనే ఒక నిర్ణయాని కొచ్చేశాను.

"నువ్వో రెండు వందలివ్వు" అన్నాడు అవ కాశరావు చెవిలో నెమ్మదిగా.

"సాక్షి సంతకం చేసింది కాక రెండొం దలా" ఆశ్చర్యపోయాడు అవకాశరావు.

"సర్దుదూ తర్వాతిచ్చేస్తా" అన్నతర్వాత జేబులోంచి రెండొందలు తీశాడు.

అపదరావిచ్చిన నోట్లన్నీ లెక్కపెట్టుకుని, కొన్ని నోట్లు మడిచి జేబులో పెట్టుకుని, "రేపొచ్చి మీ కాగితాలు మీరు పట్టుకుపోండి" అంటూ మరోవైపు వెళ్ళిపోబోయాడు బం ట్రోతు.


"మరి అకనాలెడ్జిమెంట్ ఏమైనా యిస్తారా అది మీ దగ్గరే వున్నట్లు" అడుగుతూ అతని వెనక పరుగెత్తాడు ఆపదరావు.

"అక్కర్లేదు" అంటూ రికార్డు రూమ్‌లోకి వెళ్ళిపోయాడు బంట్రోతు. ఎవరికక్కర్లేదో బోధ పడలేదు ఆపదరావుకి.

"ఆయనగారి తెలివి చూశాకా అడక్కపోతే ఆ పదిహేను కూడా కొట్టేసును" బయటి కొచ్చాక అన్నాడు ఆపదరావు.

"మరదే మన తెలివి. రెండొందలు ఏం కష్టపడిపోయారని పంచుకు తింటారో అడ క్కుండా యిచ్చేశావుగా" అన్నాడు అవకాశరావు హేళనగా.

## ఇక నుంచి నా పర్సనల్ విషయాల జోలికొస్తేనా...?!



ప్రపంచ సుందరి ఐశ్వర్యారాయ్ ఇక నుంచి మీడియా వాళ్ళకి తన పర్సనల్ విషయాలు చెప్పదట! రిలయన్స్ సంక్షోభం అమ్మడి చలవేనని, ఆ అధినేతల్లో ఒకరికి ఐశ్వర్యతో వున్న సంబంధాల వల్లే అసలు గొడవలు ప్రారంభమయ్యాయని బాలీవుడ్ పుకార్లు వినిపిస్తున్నాయి. దాంతో నిప్పులు చెరిగిందీ సుందరీమణి. "నిన్నటి వరకూ నాకూ వివేక్‌కి పెళ్ళని, ఇంకేదో అయిందని ఇలా ఏవేవో రాసేశారు. ఇప్పుడిలా చెబుతున్నారు. ఇక నుంచీ నా పర్సనల్ విషయాలేమీ మీడియా దగ్గర చెప్పను" అంటూ భీష్మించింది ఐష్. ఐష్ ప్రతిజ్ఞ పవరు ఎంతసేపో మనకి తెలియనిదా?!

వెంటనే ఆపదరావేం మాట్లాడలేదు. కాస్సేపాగి నెమ్మదిగా అన్నాడు –

"పంచుకునే తింటారో లేక ఈయన గారొక్కడే మింగేస్తాడో మనకేం తెల్సు? చూస్తే మంచిగానే కనిపిస్తున్నాడు మరి"

"మంచివాళ్ళనీ చెడ్డవాళ్ళనీ రాశులు పోసి నట్టు జనం ఉండరు. అవకాశాన్నిబట్టి మంచి వాళ్ళు చెడ్డవాళ్ళుగానూ మారొచ్చు. అవకాశం రాకపోతే చెడ్డవాళ్ళు కూడా జీవితంలో మంచివాళ్లగానే మిగిలిపోనూ వచ్చు" అనేసి, మరో పక్కకు ముఖం తిప్పేసుకున్నాడు అవకాశరావు.

"ఇలాంటి డైలాగు ఎక్కడో విన్నట్టుందే" అనుమానంగా చూశాడు ఆపదరావు అతని వంక.

"నువ్వు సినీమాలు చూస్తావు గదా"

"ఓ"

"మరేం? కమర్షియల్ సినీమాల్లోని రెండర్థాల పాటలేగాని మంచి సినీమాల్లోని మంచి డైలాగులు గుర్తుండవు కాబోలు! బండెక్కు" అన్నాడు అవకాశరావు.

అప్పటికి సూరీడు నడినెత్తికెక్కాడు.

❋ ❋ ❋

ఆ రాత్రి ఆపదరావు ఆదమరచి నిద్రపోతే అవకాశరావుకి చాలసేపటివరకూ నిద్రే పట్ట లేదు. అతని బుర్రలో గంపెడు ఆలోచనలు.

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రాక్షసి ఇంత విచ్చలవిడిగా రాజ్యమేలుతూంటే ఎదిరించి ప్రశ్నించే నాథుడే లేడా? ఉండడా? – అని తనను తానే ప్రశ్నించుకున్నాడు. ప్రభుత్వ జీతాలు వేలకు వేలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేయవలసిన ఉద్యోగుల్లో ఈ లంచాల జాడ్యమేమిటీ అని కాస్సేపు తల పట్టుకుని బాధపడ్డాడు.

ఆ తర్వాత "ఏదో ఒకటి చెయ్యాలి" అనే నిశ్చయానికొచ్చాడు. చీకటిని తిడుతూ కూర్చునేకన్నా ఓ చిన్న దీపమైనా వెలిగించు అన్నాడో కవి. "ఆరిపోతే ఆరిపోనీ. ప్రయత్నించాలి" అనుకున్నాడు దృఢంగా. అలా పడుకుని చాలాసేపే ఆలోచించాడు.

కాస్సేపటకి ఆ చీకట్లో అతని బుర్రలో బలుబేదో వెలిగింది. అంతే! కలం, కాగితం తీసుకుని రాయడం మొదలుపెట్టాడు.

గౌరవనీయులైన ప్రభుత్వ అధికారిగారికి –

నమస్కారాలతో చేయు విన్నపములు. తమ కార్యాలయంలో ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన కంప్యూటర్లు తమ శక్తికి మించి ప్రజలకు సేవలందిస్తున్నాయి. రెండు రోజుల్లో అయ్యే పని ఒక పూటలోనూ, పూట పని గంటలోనూ, గంటలో అయ్యే పని నిముషాల్లోనూ అవుతోంది. అది ఆనందించదగ్గ విషయం. కంప్యూటర్ యంత్రాలకూ, ప్రభుత్వ యంత్రాంగానికీ మా కృతజ్ఞతలు. అయితే ప్రభుత్వానికి చెల్లించే ఫీజులు కేష్ కౌంటర్లో కేషియర్ లేకపోవడం వల్ల కాబోలు స్టాంపులు వేసే బంట్రోతు వసూలు చేయాల్సి వస్తోందని అర్థమైంది. అది విచారించవలసిన విషయం. ఆయన తన పనే కాక అతనికది అదనపు శ్రమ కూడా. తను పడే ఆ శ్రమకు అతను మరోలా మీ సమక్షంలోనే డబ్బు వసూలు చేస్తూ అందులో అందరికీ వాటాలున్నాయనడం బాధాకరమైన విషయం. అంచేత ప్రజలు వివిధ ఫీజుల రూపేణా ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము కేష్ కౌంటర్‌లో కేషియరే తీసుకుని వెంటనే రసీదులు యిప్పించే ఏర్పాటు చేయిస్తే బావుంటుంది. అవినీతికీ అపనిందలకీ కూడా ఆస్కారం లేకుండా పోతోంది. విజ్ఞులైన తమరు ఆలోచించి తమ పరిధిలో వున్నది చేయగలరు." అంటూ ఓ లేఖ తయారుచేసి ఎవరికి వెళ్ళాలో వారి ఎడ్రసుకు పోస్ట్ చేశాడు.

ఊహించని ఉత్తరానికి ప్రభుత్వాధికారి కంగారు పడ్డారు. ఆర్డినరీ పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం కాబట్టి చింపేస్తే చరిత్ర లేకుండా చిరిగిపోతుంది. కానీ యీ ఉత్తరం తాలూకు కాపీలు ముఖ్యమంత్రిగారికీ, పట్టణాధికారికీ పెట్టినట్లు దిగువన రాయడం వల్ల కొంచెం కంగారుపడ్డారు. మరి కొంచెం బాధపడ్డారు కూడా.

"ఏదో ఒకటి చెయ్యాలి" అని ఒక నిశ్చయానికి వచ్చారు.

నెల్లాళ్ళ తర్వాత ఆపదరావు వెళ్ళిన పనిమీదే అవకాశరావు కూడా అదే ఆఫీసుకి వెళ్ళాల్సి వచ్చింది. అతని వెంట సాక్షి పాత్రలో ఆపదరావు బయల్దేరాడు.

అయితే ఈమారు అక్కడి పద్ధతులన్నీ అవకాశరావుని ఆనందంలోనూ అపదరావుని ఆశ్చర్యంలోనూ పడవేశాయి. కేష్ కౌంటర్లో కేషియరు వుండి డబ్బు తీసుకొని రసీదులు యిస్తూంటే బంట్రోతు డాక్యుమెంట్ల కోసం మర్నాడు రమ్మనకుండా వెంట వెంటనే ముద్ర వేసి, సాక్షి సంతకాలు తీసుకుని యిచ్చేస్తున్నాడు.

"ఇది కలయా? వైష్ణవమాయా?" అన్నాడు వెనుకనున్న ఆపదరావు నాటక ఫక్కీలో ఆనందాశ్చర్యాలను కలగలిపి.

"కలకాదు విష్ణుమాయే. నేను వెలిగించిన దీపం వెలిగింది. యాహూ" అంటూ ఓ పెద్ద అరుపు అరిచి ఎగిరి గెంతేశాడు అవకాశరావు.

❋ ❋ ❋

'దబ్' మన్న శబ్దానికి వంటింట్లో పని చేసుకుంటున్న సుమతి పరుగుపరుగున బెడ్‌రూంలోకొచ్చింది.

అవకాశరావు కిందపడి వున్నాడు.

"అయ్యో! కిందపడిపోయారేమిటీ? కల గన్నారా? అవునూ విష్ణుమాయ అంటున్నారేమిటీ? తెల్లారి వచ్చిన కలలు నిజమౌతాయన్నది నిజమేనన్నమాట! మా విష్ణుమావయ్య ఉదయమే భద్రచలం నుండి ఫోన్ చేశాడు తనొస్తున్నట్టు" అంది భర్తతో.

"భద్రాచలమా" అన్నాడు అవకాశరావు కళ్ళు నులుముకుంటూ.

"అవును రెండేళ్ళుగా పంటలకి చీడపట్టి నష్టపోతున్నాడు. మంచి ధర పలికితే పొలం కాస్తా తెగనమ్మి పుష్కరాలయ్యేక గోదాట్లో స్నానం చేసి భద్రాచలం వస్తానని మొక్కుకున్నాడట. అది ఫలించింది కాబోలు. అట్నించిటు వస్తున్నాడు" అంది సుమతి.

"చీడలకి మందు పనిచెయ్యకపోతే అదే ఉత్తమం" అనుకుంటూ బాత్రూంలోకి దూరాడు అవకాశరావు. ❋

